క్లుప్తంగా

తాగునీటి కోసం విద్యార్థుల అవస్థలు



మరమ్మతులకు నోచుకోని తాగునీటి బోరు

భామిని: మండలంలోని బాలేరు ఎంపీపీ స్కూల్ (ఆర్)లో తాగునీరు లేక సుమారు 90 మంది విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. నాలుగు నెలలుగా స్కూల్‌లో తాగునీరు అందించే బోరు పాడైనా.. కనీసం మరమ్మతులు చేపట్టలేదని విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా దీని మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

బిటివాడ విద్యుత్ ఫీడర్‌ను విభజించండి



బిటివాడ ఫీడర్ ఉన్న వీరఘట్టం విద్యుత్ సబ్‌స్టేషన్

వీరఘట్టం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న బిటివాడ ఫీడరును విభజించాలని విద్యుత్ వినియోగదారులు కోరుతున్నారు. ప్రస్తుతం ఈ ఫీడరు 12 పంచాయతీలను కలుపుతూ వెళ్తోంది. అన్ని ఫీడర్లు కంటే బిటివాడ ఫీడరు పెద్దదిగా ఉండడంతో బ్రేక్ డౌన్లు సమయంలో సమస్యలు తలెత్తుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు, ఈదురు గాలులకు ఈ ఫీడరు బ్రేక్ డౌను అవుతుండడంతో ఈ ఫీడర్ పరిధిలో ఉన్న చిదిమి, పాలమెట్ట, గడగమ్మ, కొట్టుగుమ్మడ గ్రామాలకు తీవ్ర స్థాయిలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. సమస్య ఎక్కడ ఉందో గుర్తించడం చాలా ఇబ్బందిగా మారుతోందని లైన్‌మన్లు కూడా చెబుతున్నారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ఈ ఫీడరును పరిశీలించి విభజిస్తే నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయవచ్చునని స్థానికులు పేర్కొంటున్నారు.

దిష్టిబొమ్మల దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

పార్వతీపురం: నేషనల్ హెరాల్డ్ కుంభకోణానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీల దిష్టిబొమ్మలను బీజేపీ నాయకులు పట్టణంలో శుక్రవారం దహనం చేశారు. భారతీయ జనతా యువ మోర్చా జాతీయ శాఖ, రాష్ట్ర యువమోర్చా అధ్యక్షుడు మిట్ట వంశీకృష్ణ పిలుపు మేరకు నిరసన కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ నాయకుల దిష్టిబొమ్మలను దహనంచేసి నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎస్.శ్రీనివాసరావు, తిరుపతి, హరీష్‌రావు, సురేష్, రాము, చంద్రమ్మ, కనకరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభంపై విరిగి పడిన భారీ వృక్షం

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లిలో శుక్రవారం సాయంత్రం కురిసిన గాలి, వర్షానికి గ్రామసమీపంలో భారీ వృక్షం విరిగి పక్కనే ఉన్న కరెంటు పోల్‌పై పడడడంతో పోల్ విరిగిపోయింది. దీంతో రోడ్డుపై కొంత సమయం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వెంటనే విద్యుత్ అధికారులు పనులు ప్రారంభించి కొత్తపోల్ వేశారు. విద్యులైన్ కలిపేందుకు చర్యలు చేపట్టారు.

ఉపాధి కూలీల వేతనం వెంటనే చెల్లించాలి



నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

సాలూరు రూరల్: మండలంలోని ఉపాధి కూలీలకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీను డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని నెలిపర్తి గ్రామంలో పెదవెంకన్న చెరువు బొడ్డల బందలో ఉపాధి పనులు పరిశీలించిన వ్యవసాయ కూలీ సంఘం నాయకులు కూలీలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కూలిడబ్బులు వెంటనే చెలించడంతోపాటు రెండవపూట పూట పని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. సంవత్సరంలో రెండువందలరోజులు పని కల్పించడంతో పాటు కూలి రూ.600 కు పెంచాలని, లేదంటే పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

క్రైస్తవ విశ్వాసులు శుక్రవారం గుడ్ ఫ్రైడేను వేడుకగా నిర్వహించారు. ఏసుక్రీస్తు శిలువ మీద పడిన శ్రమను అప్పటి కాలానికి తగినట్టుగా వేషధారణలతో ప్రదర్శించారు. క్రైస్తవ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



గుమ్మలక్ష్మీపురం: గుడ్‌ఫ్రైడే సందర్భంగా గుమ్మలక్ష్మీపురంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



పాలకొండ రూరల్: చినమంగళాపురంలో గుడ్ ఫ్రైడే వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు



పాలకొండ రూరల్: పట్టణంలో శిలువ యాత్ర చేపడుతున్న క్రైస్తవ విశ్వాసకులు



గరుగుబిల్లి: రావుపల్లిలో గుడ్ ఫ్రైడేలో పాల్గొన్న క్రైస్తవులు



భామిని : నల్లరాయిగూడలో విశ్వాసకుల శిలువ ప్రదర్శన చేస్తున్న నమ్మకస్తులు



సీతంపేట: క్రీస్తు వేషధారణలో పాదయాత్ర చేస్తున్న క్రైస్తవులు



కొమరాడ: శివిని గ్రామంలో విచారణ పరిశుద్ధం కోసం వేషధారణలో క్రైస్తవులు



వీరఘట్టం: యేసుక్రీస్తు, దేవదూతల వేషధారణలో ఉన్న క్రైస్తవ భక్తులు



జియ్యమ్మవలస రూరల్: చినమేరంగిలో గుడ్‌ఫ్రైడే వేడుకలు

రుణ లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం

జియ్యమ్మవలస రూరల్: బీసీ రుణాల లబ్దిదారుల ఎంపికలో రాజకీయ జోక్యంతో నిరుద్యోగ యువత తీవ్ర నిరాశకు గురైంది. మండలంలో బీసీ రుణాల కోసం 398 మంది దరఖాస్తు చేసుకున్నారు. మండలంలో 86 యూనిట్లకు సంబంధించి రూ.కోటి 65 లక్షల 50 వేలు మంజూరు కోసం సంబంధిత బ్యాంకు అధికారుల సమక్షంలో ఎంపిక కార్యక్రమాన్ని గత నెల 29న నిర్వహించారు. అయితే ఇందులో అధికార పార్టీ నేతలు సూచించిన వారికే టిక్ పెట్టారని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అభ్యర్థుల ఎంపికలో అధికారుల పాత్ర కేవలం నామమాత్రమేనని వారు ఆరోపిస్తున్నారు. దీంతో నిజమైన అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్‌లోనైనా ఇలా జరగకుండా అర్హులకు వీటిని ఎంపిక చేయాలని పలువురు సూచిస్తున్నారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని గెడ్డతిరువాడ గ్రామ సమీపాన గత మూడు రోజులుగా కొందరు యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలను జరిపిస్తున్నారు. తమ వ్యాపారానికైనా వ్యక్తిగత అవసరాలకైనా మట్టి తవ్వకాలను జరిపేటప్పుడు స్థానిక తహసీల్దార్‌కు తెలియజేసి ఆయన అనుమతితో తవ్వకాలను జరిపించాల్సి ఉంది. అయితే వీరు ఎవరి అనుమతి లేకుండా వందల ట్రాక్టర్ల మట్టి లోడ్లను తరలిస్తున్నారు. అక్రమ తవ్వకాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



అక్రమంగా తరలిస్తున్న మట్టి

తేనెటీగల దాడిలో పంపు ఆపరేటర్‌కు గాయాలు

వీరఘట్టం:

స్థానిక మేజరు పంచాయతీలో పంపు ఆపరేటర్‌గా పని చేస్తున్న దిబ్బ శ్రీనివాసరావుపై తేనెటీగలు దాడి చేయడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం ఉదయం మేజరు పంచాయతీలోని నీళ్ల ట్యాంకు వద్దకు వెళ్లి పంచాయతీలో కుళాయి పాయింట్లుకు రక్షిత మంచి నీటిని విడిచిపెట్టేందుకు వాల్వ్ తిప్పాడు. ఇంతలో పక్కనే ఉన్న తేనె పట్టులో ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా వచ్చి శ్రీనివాసరావుపై దాడి చేశాయి. వెంటనే అక్కడి నుంచి శ్రీనివాసరావు పరుగులు తీశాడు. వీరఘట్టం పీహెచ్‌సీలో వైద్య చికిత్సలు అందించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని ఈఓ కోటేశ్వరరావు తెలిపారు.



తేనెటీగల దాడిలో గాయపడిన పంపు ఆపరేటర్ శ్రీనివాసరావు

హెచ్‌పీ గ్యాస్ సిబ్బందికి అవగాహన

పాలకొండ: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక గ్యాస్ గొడౌన్‌లో సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో గ్యాస్ బండల కారణంగా జరిగే ప్రమాదాల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వినియోగదారులకు సిలిండర్ అందించిన సమయంలో పూర్తిగా పరిశీలన చేయాలని తెలిపారు. వాహనం మీద నుంచి బండలను కిందకి పడేయకుండా దింపించాలని సూచించారు. గ్యాస్ గొడౌన్‌లో వెంటిలేషన్ సక్రమంగా ఉంచాలని తెలిపారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.



గ్యాస్ గొడౌన్ వద్ద అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

24న ధర్నాకు తరలిరండి

పాలకొండ రూరల్: పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ వద్ద ఈ నెల 24న తలపెట్టిన ధర్నాలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొనాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.గౌరీశ్వరరావు, ఆర్.రాములు పిలుపునిచ్చారు. పాలకొండలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ధర్నా చేయనున్నట్టు తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కూటమి అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా తమ సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో ఎం.లక్ష్మణరావు, ఎ.కాశీవిశ్వనాథం, తమ్మనాచారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సంఘ నాయకులు

టీఏల కొలతల ప్రకారమే మట్టి పనులు



టీఏలు ఇచ్చిన కొలతలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు

సీతానగరం: మండలంలో ఉపాధిహామీ పథకం ద్వారా పనులు చేస్తున్న వేతనదారులు టెక్నికల్ సహాయకులు నిర్దేశించిన కొలతల ఆధారంగా పనిలో పాల్గొని సమయ పాలన పాటించాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. ఈ మేరకు గ్రామాల్లో వేతనదారులకు చెరువుల్లో ఎంతమందితో ఎంతదూరంలో ఎంతలోతులో పని చేయాలో టెక్నికల్ సహాయకులు ఇచ్చిన కొలతలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారులు పనులు చేయడంలో మెలకువలు పాటించాలని కోరారు. అలాగే జాబ్‌కార్డులున్న వేతన దారులందరికీ ఉపాధి పనులు కల్పించనున్నామన్నారు. మేట్‌లందరూ నిర్దేశించిన సమయానికే మస్తరు వేయాలని సూచించారు. కార్యక్రమంలో టీఏలు, క్షేత్రసహాయకులు, మేట్‌లు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

పార్వతీపురంటౌన్:

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని తపాలాశాఖ డివిజన్ కార్యాలయం సూపరింటెండెంట్ రెడ్డి బాబూరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం తపాలాశాఖ పార్వతీపురం డివిజన్ పరిధిలోని ఉద్యోగులకు షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తపాలాశాఖ అభివృద్ధిలో మనమంతా భాగస్వాములమవుతూ శారీరక, మానసిక వికాసం కోసం క్రీడలు ఆడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్క ఉద్యోగి విధినిర్వహణతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. తపాలా శాఖలో ఉన్న ఎంతోమంది ఉద్యోగులు జిల్లా, రాష్ట్ర జాతీయస్థాయిలో వివిధ క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా క్రీడల పట్ల మీతో పాటూ పట్టణాల్లో, గ్రామాల్లో ఉన్న యువతలో ఆసక్తి పెంచాలని సూచించారు. సాయంత్రం అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ ఐ.మురళి ఆధ్వర్యంలో ప్రథమ, ద్వితీ య, తృతీయ స్థాన విజేతలకు సూపరింటెండెంట్ బాబూరావు బహుమతులు ప్రదానం చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

గరుగుబిల్లి: ఐదేళ్ల నిండిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని చిలకాం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రామ్మోహనరావు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. చిలకాం, మరుపెంట పంచాయతీ గొల్లవానివలస గ్రామాల్లో శుక్రవారం పర్యటించి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, విద్య గూర్చి తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించడంతో పాటు మధ్యాహ్న భోజనం, బ్యాగులు, యూనిఫాం, పుస్తకాలను ఉచితంగానే అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలంటే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఈయనతో పాటు తల్లిదండ్రులు ఉన్నారు.



తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతను తెలియజేస్తున్న హెచ్‌ఎం

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

గరుగుబిల్లి: ప్రతీ ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా ఆరోగ్యవంతంగా ఉండవచ్చని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండలంలోని దళాయివలసలో ఫ్రైడే – డ్రైడే కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధులు సంభవించవన్నారు. కాలువల్లో చెత్త చెదారాలను వేయడం వల్ల మురుగునీరు ప్రవహించకుండా ఎక్కడికక్కడే నిల్వ వుండడంతో దోమలు, ఈగలు ప్రబలుతున్నాయన్నారు. తద్వారా వ్యాధులు సోకుతున్నాయన్నారు. ఇంటిలో ఉన్న చెత్తా చెదారాలను చెత్త సేకరించే కార్మికులకు అందజేయాలన్నారు. ఈ సందర్భంగా తాగునీటి బోర్లు, మంచినీటి బావులు, రక్షిత పథకాల్లో క్లోరినేషన్‌ను చేయించారు. కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించారు. ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



దళాయివలసలో క్లోరినేషన్ నిర్వహణను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పరామర్శ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని వంగర పంచాయతీ సర్పంచ్ పి.జ్యోతి, ఆమె భర్త పి.తిరుపతిరావు కుటుంబ సభ్యులను మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి శుక్రవారం పరామర్శించారు. తిరుపతిరావు తల్లి ఇటీవల మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మృతికి కారణాలను తెలుసుకున్నారు. ఆమె వెంట ఎంపీపీ కుంబురుక దీనమయ్య, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, నిమ్మక లక్ష్మణరావు, సర్పంచ్‌లు ఎం.శంకరరావు, బొత్తాడ గౌరీశంకరరావు, బిడ్డిక సూర్యం, ముసురు, వైఎస్సార్‌సీపీ నాయకులు నిమ్మక గోపాల్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్ జ్యోతి, తిరుపతిరావు దంపతులను పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి

సాకిగెడ్డ పరిసరాల్లో చెక్‌డ్యామ్ నిర్మించాలి

పార్వతీపురంటౌన్: సాకిగెడ్డ పరిసర ప్రాంతంలో చెక్‌డ్యామ్ నిర్మించాలని తాళ్లబురిడి గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ చెక్‌డ్యామ్ నిర్మించడం వల్ల సాగు పొలాలకు నీరు అందుతుందని, పంటలు పండుతాయని తెలిపారు. సుమారు 300 ఎకరాల పొలాలకు ఈ గెడ్డద్వారా నీరు అందుతుందని, చెక్‌డ్యామ్ లేకపోవడం వల్ల సాగునీరు సమయానికి అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



నేరడిలో కురుస్తున్న వర్షం

వర్షంతో ఉపశమనం

భామిని: మండలంలో పలు ప్రాంతాల్లో శుక్రవారం వర్షం కురిసింది. రెండో రోజులుగా సాయంత్రం చల్లని గాలులు వీయడం తప్ప వర్షం కురవలేదు. శుక్రవారం కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు. వర్షం తమకు మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు.